క్లుప్తంగా

కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలి


ఆకులసీతంపేటలో కిచెన్‌గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో ఖాళీ స్థలం ఉంటే కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఎంఈఓలు జగదీశ్వరరావు, బాల భాస్క రరావు ఉపాధ్యాయులకు సూచించారు. చామలాపల్లి, ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలలను గురువారం వారు సందర్శించారు. ఆకులసీ తంపేట పాఠశాల ప్రాంగణంలో కూరగాయలు,ఆకుకూరల సాగును పరిశీలించారు. చామలాపల్లిలో పాఠశాలలో తరగతి గదుల్లోని గోడలపై ఉన్న చార్టులను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ, మెనూ,అమలుపై ఉపాధ్యాయులను ఆరా తీశారు.

పేకాట శిబిరంపై దాడులు

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట పరిసరాల్లో పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు వంగపల్లిపేట సమీపంలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేశామని చెప్పారు. ఈ ఘటనలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.32,990 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఎస్సై కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

కాలంరాజుపేటలో వైద్యశిబిరం


సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో గురువారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో వైద్యసిబ్బందితో కలిసి 47మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు ఆరోగ్యజాగ్రత్తలు సూచించారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఫ్లోరెన్స్




వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా టి.ఎం. ఫ్లోరెన్స్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఈమె గురుకులాల జిల్లా ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్‌గా అయిదు నెలలు బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా కో-ఆర్డినేటర్‌గా విశాఖ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన రూపవతి బాధ్యతలు స్వీకరించడంతో ఫ్లోరెన్స్ తిరిగి బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు.

కల్వర్టు నిర్మించాలని ఆందోళన


కల్వర్టు వద్ద బైఠాయించిన ప్రయాణికులు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామం నుంచి ఆనందపురం వెళ్లే రోడ్డులో రైవాడ కాలువపై శిథిలమైన కల్వర్టు స్థానంలో కొత్తగా కల్వర్టు నిర్మించాలని ఆమార్గంలో ప్రయాణించే గ్రామాల ప్రజలు గురువారం ఆందోళనకు దిగారు. శిథిల కల్వర్టుపై బానాది గ్రామ ఎంపీటీసీ గొంప తులసి ఆధ్వర్యంలో గొంప వెంకటరావు, ప్రయాణి కులు బైఠాయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ కల్వర్టు శిథిలం కావడంతో పాటు రక్షణగోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉందన్నారు. రైవాడ కాలువ నిర్వహణ బాధ్యత జీవీఎంసీ పరిధిలో ఉన్నం దున, జీవీఎంసీ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్లైఓవర్‌కు మరమ్మతులు


చిన్నరావుపల్లి వంతెనపై మరమ్మతులను పర్యవేక్షిస్తున్న డీఈ శ్రీనివాసరావు, సర్పంచ్ దేముడు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-విజయనగరం రోడ్డులో చిన్నరావుపల్లి గ్రామ సమీపంలోని ప్లైఓవర్ మరమ్మతుల పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, చిన్నరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు దగ్గరుండి వంతెనపై గుంతలను పూడ్చి వేయించారు. మూడు,నాలుగు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పారు

ప్రారంభించే ఉద్దేశం లేదా..?

- ప్రారంభానికి నోచుకోని జిల్లాస్థాయి అగ్రిల్యాబ్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3.68 కోట్లతో భవన నిర్మాణాలు
- ఎన్నికల కోడ్‌రావడంతో నిలిచిపోయిన ప్రారంభోత్సవం
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని వైనం
- ల్యాబ్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్న రైతన్నలు


నెలివాడలో నిర్మించిన జిల్లాస్థాయి అగ్రిల్యాబ్ భవనం

బొండపల్లి: రైతులకు సాగు సంబంధిత సేవలందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రతి నియోజకవర్గానికి ఒక ల్యాబ్‌తో పాటు వాటిని అనుసంధానిస్తూ జిల్లాస్థాయిలో ఒక ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో అగ్రిల్యాబ్‌ల భవనాల నిర్మాణం, ప్రారంభోత్సవాలు పూర్తయినప్పటికీ జిల్లాస్థాయి ల్యాబ్ నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లాస్థాయి ల్యాబ్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3.68 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో ల్యాబ్ నిర్మాణానికి బొండపల్లి మండలంలోని నెలివాడ వద్ద 2020 జూన్ 8వ తేదీన అప్పటి పురపాలకశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థా పన చేశారు. కరోనా ప్రభావంతో భవన నిర్మాణాలకు కొంతకాలం ఆటంకం కలిగింది. కొన్నిరోజుల తర్వాత పనులు పునః ప్రారంభించి భవన నిర్మాణం పూర్తి చేశారు. భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చేయడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది.

ప్రారంభిస్తే రైతులకు ఎంతో మేలు

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు పరీక్షల నిర్వహణతో పాటు భూసార పరీక్షలు, తదితర సేవలు అగ్రిల్యాబ్‌ల ద్వారా అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు, ఎరువులనే కాకుండా మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే విత్తనాలు, ఎరువులకు కూడా ఈ ల్యాబ్‌లో రైతులు పరీక్షలు చేయించుకుని వాటి నాణ్య తను తెలుసుకోవచ్చు. పశువుల కు రక్షపరీక్షలు, ఇతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు కూడా చేయించుకోవచ్చు. నూతన వంగడాల సాగు, సస్యరక్షణ చర్యలు, పంటల సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, తదితర అంశాలపై రైతులు తమ సందేహాలను ల్యాబ్‌లో ఉన్న శాస్త్రవేత్తలకు వివరిస్తే వారు నివృత్తి చేసే ఒక చక్కటి వ్యవస్థను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలోనే పలు జిల్లాల్లో జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్‌ల సేవలు అందుబాటులోకి వచ్చాయి. విజయనగరం జిల్లాలో మాత్రం రైతులకు నేటికీ ఈ సేవలు అందడం లేదు. ఇక్కడ ల్యాబ్ ప్రారంభం కాకపోవడంతో జిల్లా రైతులు తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. అన్ని వసతులతో భవనం అందుబాటులో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ల్యాబ్‌ను ప్రారంభించకపోవడంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా అగ్రిల్యాబ్ గురించి ప్రభుత్వ పెద్దలు, జిల్లా మంత్రి, ఎమ్మెల్యేల నుంచి ఒక్క ప్రకటన కూడా రాలేదు. అసలు ఈ ప్రభుత్వానికి అగ్రిల్యాబ్‌ను ప్రారంభించే ఉద్దేశం ఉందా, లేదా అనే సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందిని నియమించాల్సి ఉంది



జిల్లాస్థాయి అగ్రిల్యాబ్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ల్యాబ్‌లో ప్రయోగాలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందజేయా ల్సి ఉంది. అలాగే సిబ్బంది,టెక్నీషియన్‌లను నియమించాల్సి ఉంది. సదుపాయాలన్నీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ల్యాబ్‌ను ప్రారంభించే అవ కాశం ఉంది. ల్యాబ్ అందుబాటులోకి వస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.మహరాజన్, గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



రైతుల సంక్షేమం, వారి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదు. సాగులో రైతులకు చేదోడువాదోడుగా ఉండేందుకు గత ప్రభుత్వ హయాం లో అగ్రి ల్యాబ్ నిర్మించింది. దానిని ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఈ ప్రభుత్వానికి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశం ఏమాత్రం ఉన్నా...వెంటనే ల్యాబ్‌ను ప్రారంభించాలి.

– తాళ్లపూడి అప్పలనాయుడు, రైతు, రోళ్లవాక గ్రామం, బొండపల్లి మండలం

కషాయాలతో తెగుళ్లకు చెక్



మామిడి, జీడితోటలను ఆశించే తెగుళ్లను ప్రకృతి వ్యవసాయ విధానంలో కషాయాలను వినియోగించి సమర్థవంతంగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఎంటీ సన్యాసినాయుడు అన్నారు. రయింద్రాం గ్రామంలో రైతులకు కషాయాల తయారీపై గురువారం అవగాహన కల్పించారు. రైతు లతో దశపర్ణి కషాయం తయారు చేయించారు. 6 లీటర్ల కషాయాన్ని100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా తోటకు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పూత ,పిందె దశలో పంటను ఆశించే తెగుళ్లను ఈకషాయంతో నివారించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కర్రి రామునాయుడు, బి.ఉమ, ఆర్.అప్పలనాయుడు, బి.పైడిరాజు,బి.సన్యాసినాయుడు, కొండమ్మ,కె.కృష్ణ పాల్గొన్నారు. – బొండపల్లి

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



షుగర్, బీపీతో సతమతమవుతున్న వారు టీబీ(క్షయ) వ్యాధి బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని క్షయ నిర్మూలన సంస్థ సూపర్‌వైజర్ జి.లలిత సూచించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దేవర పొదిలాం, గుణిదాం, నిమ్మలవలస తదితర గ్రామాల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. 241 మందికి వైద్య పరీక్షలు, 24 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ప్రతీ ఆరోగ్య సెంటర్ పరిధిలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. – చీపురుపల్లి

మంచు దుప్పటి


పెదవేమలిలో కురుస్తున్న మంచు

గంట్యాడ మండలంలోని పలు గ్రామాలను గురువారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కుర వడంతో రోడ్లపై వాహనాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్లు వేసుకుని వెళ్లినా రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహ నాలు కనబడని పరిస్థితి. పొగమంచు ప్రభావంతో అపరాలు, మామిడి పంటలో పూత మాడిపోయే అవకాశాలు ఎక్కువని రైతులు ఆందోళన చెందుతున్నారు. – గంట్యాడ

‘మారిక’ మార్గానికి మోక్షం లేదా?

- రోడ్డు పనులు ప్రారంభించేంత వరకు ఆందోళన
- వంటావార్పుతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద గిరిజనుల బైఠాయింపు


ఎంపీడీఓ కార్యాలయం ద్వారం వద్ద బ్యానర్ పెట్టి నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకుడు జగన్, మారిక గిరిజనులు


ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో వంటవార్పు చేస్తున్న గిరిజనులు

వేపాడ: స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు అయినా స్వాతంత్ర్య ఫలాలు గిరిజనులకు దక్కేది ఎప్పుడు? మారిక గ్రామ గిరిజనులకు అందరిలా విద్య, వైద్యం అందెదెప్పుడు? మారిక గ్రామానికి రోడ్డు నిర్మించేదెప్పుడు? అంటూ గిరిజనులు నినాదాలతో ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ నేతృత్వంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో నేటికీ రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని గిరిజనులు వాపోయారు. కరకవలస నుంచి మారికకు 10.6 కిలోమీటర్లు రహదారి నిర్మాణానికి ఉమ్మడి రాష్ట్రంలో రూ.ఐదుకోట్లు మంజూరయ్యాయి. దీనిపై 2 కి.మీ మేర కల్వర్టులు, తారు రోడ్డు పూర్తయింది. మిగిలిన దానికి అటవీ శాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అటవీశాఖ అనుమతులు రావడంతో తిరిగి పనులు ప్రారంభించినప్పటికీ అనంతరం నిలిచిపోయాయి.

సాకులు చెబుతున్న అధికారులు

ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జగన్‌మాట్లాడుతూ 2013–14లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో రూ.ఐదు కోట్లు నిధులు మంజూరైతే నేటికీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేశారని మిగిలిన నిధులు అలాగే ఉన్నాయన్నారు. అటవీ అనుమతులు వచ్చినా రోడ్డు నిర్మించకపోవడం బాధాకరమన్నారు. నిత్యం అధికారులు ఏవో సాకులు చెబుతూ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం లేదని దీంతో గిరిజనులు విద్య, వైద్యంతో పాటు కనీస సౌకర్యాలు పొందలేకపోతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. రోడ్డు నిర్మాణం ప్రారంభించేంతవరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. మారిక గ్రామ గిరిజనులు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వంటావార్పు చేసి భోజనాలు చేశారు. రాత్రికి కార్యాలయంలోనే పడుకుని నిరసన తెలియజేస్తామని చెప్పారు. దీనిపై ఎంపీడీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ తహసీల్దార్ జె.రాములమ్మ, పీఆర్ పీఐయూ జేఈ ఐశ్వర్య ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ గిరిజనులు ఆందోళన విరమించలేదు. రోడ్డుపనులు ప్రారంభించేవత వరకు ఇక్కడే ఉంటామని భీష్మించారు.

డ్రగ్స్ జోలికి పోవద్దు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ అప్పలనాయుడు

వేపాడ: విద్యార్థులు, యువత డ్రగ్స్ జోలికిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ బి.దేవి నేతృత్వంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసంద ర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ అప్పా రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం రేపు

గజపతినగరం: మద్యం కేసుల్లో సీజ్ చేసిన రెండు ద్విచక్రవాహనాల (హీరో ప్లెజర్, మ్యాస్ట్రో)కు స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయనగరం వారి ఆధ్వర్యంలో వేలం వేయనున్నామని,ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు


జేసీ సేతుమాధవన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించొద్దని, నోటీసులు కూడా ఇవ్వకుండా వెంటనే ఆక్రమణలు తొలగించి చర్య లు తీసుకోవాలని జేసీ సేతు మాధవన్ రెవెన్యూ అధికారులను ఆదే శించారు. తహసీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో ముషిడిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. గ్రామపరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు పెరిగాయని, లేఅవుట్ల పేరుతో చెరువులు ఆక్రమించేశారని, ఈ విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు జేసీకి ఫిర్యాదు చేశారు. తాటిపూడి భూములు ఆక్రమించి, భవనాలు కట్టేసి, ఆక్రమ విద్యుత్ కనెక్షన్లతో దర్జాగా వాడుకుం టున్నారని జేసీకి వివరించారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ఇరిగేషన్‌శాఖ భూములను కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారని పత్రికల్లో కథనాలు వచ్చినా సంబంధిత శాఖాధికారులకు చీమకుట్టినట్లయినా లేదని, ఇరిగేషన్ భూములు అమ్మేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయన్నారు. జేసీ స్పందిస్తూ గ్రామస్తుల ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ధనుర్మాస పూజలు


గజపతినగరం: గజపతినగరంలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి


లక్కవరపుకోట: రెల్లిగౌరమ్మపేట రామాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

గజపతినగరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.స్వామి వారు, అమ్మవార్లకు ఆలయ అర్చకులు శ్రీనివాసరామానుజాచార్యులు గురువారం ప్రత్యేక పూజలతో పాటు తిరుప్పావడ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు రమణారావు, తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు.

రెల్లిగౌరమ్మపేటలో..

లక్కవరపుకోట: మండలంలోని రెల్లిగౌరమ్మపేట గ్రామ రామాలయంలో అర్చకులు ఐ.సతీష్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున గ్రామంలో మెలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.

సమగ్ర రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం


శృంగవరపుకోట: రీసర్వేపై మరుపల్లిలో అవగాహన ర్యాలీ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు


బొండపల్లి: బి.రాజేరులో భూసర్వే ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు సమగ్ర భూసర్వేతో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. ఏపీ రీసర్వే కార్యక్రమంపై బి.రాజేరు గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఎంపీపీ చల్లా చలంనాయుడు ప్రారంభించారు. గతంలో రీసర్వే పూర్తి కాని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయిన తర్వాత సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, వీఆర్‌ఓ గెద్ద నారాయణరావు పాల్గొన్నారు.

రీసర్వేను వినియోగించుకోండి

శృంగవరపుకోట: భూ రీసర్వే కార్యక్రమాన్ని రైతులు, వినియోగించుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి రైతులకు సూచించారు. మండలంలో రీసర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మరుపల్లిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రపురంలో..

లక్కవరపుకోట: మండలంలోని వీరభద్రపురంలో భూరీసర్వేపై డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు మండలానికి ఒక గ్రామాన్ని రీసర్వేకి ఎంపిక చేశారని తెలిపారు.ఇ ప్పటికే గ్రామంలో ప్రభుత్వ భూములను సర్వే చేశామని, శుక్రవారం నుంచి రైతుల జిరాయితీ భూములను సర్వే చేస్తామన్నారు.రైతులు తమ భూహ క్కు పత్రాలు పట్టుకుని దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్, ఆర్ఐ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లోగా పరిష్కరిస్తాం

మెరకముడిదాం: భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందజేసిన అర్జీలకు 45 రోజుల్లోగా పరిష్కారం చూపిస్తామని జిల్లా సర్వే ఏడీ కె.రమణమూర్తి తెలిపారు. కొర్లాం గ్రామంలో తహసీల్దార్ అజూరఫీజాన్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమ భూసమస్యలపై అర్జీలు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పి.ఎస్.ఆర్.పురంలో..

గజపతినగరం: మండలంలోని పి.ఎస్.ఆర్.పురం గ్రామంలో తహసీల్దార్ బి.రత్నకుమార్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీ లు స్వీకరించారు.రైతుల భూసమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. రీసర్వే డీటీ జోగినాయుడు ,ఆర్ఐ కె.అప్పలరాజు,స్థానిక సర్పంచ్ గిడిజాల కామునాయుడు, ఏనుగుల శ్రీనివాసరావు, లకు ష్మనాయుడు పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి


లక్కవరపుకోట: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. మండలంలోని తలారి, దాసుళ్లపాలెం గ్రామాల్లో తహసీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.రైతులనుంచి ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ అర్జీలు స్వీరించారు. మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మెరకముడిదాం: కొర్లాంలో రైతుల సమస్యలను వింటున్న జిల్లా సర్వే ఏడీ రమణమూర్తి


లక్కవరపుకోట:తలారిలో ఎమ్మెల్యే లలిత కుమారికి అర్జీ అందజేస్తున్న రైతు

గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై దృష్టి

- డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు


పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వేపాడ: జిల్లాలో గంజాయి రవాణా, డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించామని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు, చార్జ్‌షీట్లు పరిశీలించి ఎస్ఐ బి.దేవికి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమై గ్రామాల్లో శాంతిభద్రతలపై ఆరా తీశారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రధాన రహదారిలో క్వారీల లారీలు లోడ్‌లతో ప్రయాణించేటప్పుడు మలుపులవద్ద రాళ్లు పడిపోతున్నాయని, దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాగే గ్రామాల్లో దొంగతనాలు పెరిగిపోయాయని విలేకరులు డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన డీఎస్పీ స్పందిస్తూ ఓవర్ లోడ్ నియంత్రణ, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల కిరు వైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ఎస్ఐకి సూచించారు. ఆయన వెంట ఎస్‌కోట రూరల్ సీఐ అప్పలనాయుడు ఉన్నారు.